క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఏపీఎం పరిదుమస్తాన్

పాలసముద్రం : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఐకేపీ ఏపీఎం పరిదు మస్తాన్ తెలిపారు. మంగళవారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఏపీఎం మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలంటే మొక్కల పెంపకం తప్పనిసరని తెలిపారు. నాటిన మొక్కలను మధ్యాహ్న భోజన విరామం సమయంలో నీరుపోసి రక్షించాలని తెలిపారు. డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా పనిచేయాలి



తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణశాస్త్రి

కార్వేటినగరం: ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మద్యం స్టాకు , అమ్మకాల నగదు విషయంలో ఏలాంటి పొరబాట్లకు తావివ్వకూడదని చిత్తూరు మద్యండిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి సూచించారు. మంగళవారం మండలంలోని పలు మద్యం దుఖాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది మంది సిబ్బంది పొరబాట్లతో భవిష్యత్ పాడు చేసుకుంటున్నారని తెలిపారు. విడిమద్యం, కల్తీ మద్యంపై కూడా ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సూచనలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : విధి నిర్వహణలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. మంగళవారం వనదుర్గాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడంతోపాటు యూనిఫాం ధరించాలన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు,

హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలకు వైద్య పరికరాలు



పరికరాలను అందజేస్తున్న మాధవి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి మాధవి ఆధ్వర్యంలో సేవ్ ద చిల్డ్రన్ సంస్థ కో–ఆర్డినేటర్ హేమంత్ మంగళవారం హెల్త్, వెల్‌నెస్ కేంద్రాల సిబ్బందికి వైద్య పరికరాలను అందజేశారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ, మండలంలోని 14 హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలకు బీపీ ఆపరేటర్, స్టెతస్కోప్, వేయింగ్ మెషిన్, థర్మామీటరు, గ్లూకో మీటరు, ఫుట్‌స్టెప్స్, ఇన్‌ఫ్రారెడ్ థర్మామీటరు, డస్ట్‌బిన్లు, స్టాండ్స్, గ్లూకో స్ట్రిప్స్, నీడిల్ కట్టర్, ఆటో క్లేవ్ మొదలైన వాటిని సేవ్ సంస్థ అందజేసిందని తెలియజేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్రమణ్యం, గౌరి, 'సేవ్' సంస్థ సిబ్బంది మునెమ్మ, గీత, మునివేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి అన్నా రు. మంగళవారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల పురోగతి గురించి ఏఎస్‌ఐ చలపతిని అడిగి తెలుసుకున్నారు. మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం, ఎర్రచందనం స్మగ్లర్లు గుడిపాల మీదుగానే అధికంగా వెళ్తున్న నేపథ్యంలో దీనికి చెక్ పెట్టే దిశగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు.

రైతన్న సేవలో ఆర్‌బీకేలు

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే మాటను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపెట్టింది. గ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా అందుతున్న సేవలు రైతన్నలకు వరంలా మారాయి. సేద్యం సజావుగా సాగేందుకు ఆర్‌బీకేలు కీలకంగా మారాయి. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందుల, నాణ్యమైన విత్తనాలు ఎమ్మార్పీ ధరకే రైతుకు రవాణా సమస్య లేకుండా స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయి. సస్యరక్షణ చర్యలు, సాగు సూచనలు క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఆర్‌బీకేల ద్వారా గ్రామంలోనే సేవలు అందిస్తూ వ్యవసాయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండుగలా మార్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – నింద్ర



నింద్రలో ట్రాక్టర్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా(ఫైల్)

- అన్ని రకాల సేవలు గ్రామాల్లోనే
- కియోస్క్ ద్వారా డిజిటల్ ఆధారిత సేవలు
- కస్టం హైరింగ్ గ్రూపులద్వారా వ్యవసాయ పరికరాలు
- భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు
- సేవలు చాలా బాగున్నాయంటున్న రైతులు

రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు ఎమ్మార్పీకే లభ్యమవుతున్నాయి. దీంతో రవాణాభారం, అధిక ధరల సమస్య తీరింది. డిటిటల్ ఆధారితసేవల ద్వారా ఈ మల్టిఫంక్షనల్ కియోస్క్‌లు సాంకేతికంగా రైతుల అవసరాలకు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రాప్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. సబ్సిడీ వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నారు. కౌలురైతులను గుర్తించి కార్డులను మంజూరు చేస్తున్నారు. బ్యాంకు సహాయకులను ఆర్‌బీకేలకు అనుసంధానం చేయడంతో సున్నావడ్డీకే రుణాలు అందుతున్నాయి. రైతు భరోసా ద్వారా పంటపెట్టుబడి సాయం అందుతోంది. పంటలకు ఉచిత బీమా చేస్తున్నారు.

పొలం బడి ద్వారా రైతుల పొలాల్లోనే శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పంటకోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో, 40 శాతం రైతులు సేంద్రియ సాగు విధానాలను అవలంబిస్తున్నారు.

నింద్ర మండలంలో ఆర్‌బీకే కేంద్రాలు	:11
సేవలు పొందుతున్న రైతులు	: 3,236 మంది
ఏడాదికి రైతు భరోసా పంపిణీ	: రూ. 3కోట్లు
విత్తనాల పంపిణీ	: 220 క్వింటాళ్లు
ఎరువులు పంపిణీ	: 345 టన్నులు
సున్న వడ్డీ రుణాలు	: రూ. 32 లక్షలు
మల్టీ ఫంక్షనల్ కియోస్కులు	:11
మొత్తం కస్టం హైరింగ్ గ్రూపులు	:10
వైఎస్సార్ యంత్ర సేవాలో అందిన ట్రాక్టర్లు	:8
కౌలు రైతులకు అందించిన కార్డులు	: 72



ఈ క్రాప్‌-పై రైతులకు సూచనలిస్తున్న అధికారులు



రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

రైతు సంక్షేమ ప్రభుత్వం



పంట పెట్టుబడిగా రైతుభరోసా, దున్నకానికి ఆర్‌బీకేలో ట్రాక్టర్, అక్కడే ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పంట పెరిగాక క్రిమిసంహారక మందులు, పంట అమ్మకాలు, నష్టం జరిగితే ఉచితంగా బీమా దీనికంటే ఓ రైతుకు ప్రభుత్వం నుంచి ఇంకేం సాయం కావాలి. నిజంగా ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం.
– కృష్ణారెడ్డి, రైతు, కర్పరవేడు

చిన్న రైతులకు ట్రాక్టర్లు



రైతులకు అండగా ఎరువులు, వ్యవసాయ పరికరాలు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంటున్నాయి. గతంలో దూరప్రాంతాలకు వ్యయప్రయాసలకు ఓర్చి తెచ్చుకునేవారం. గతంలో ట్రాక్టర్ కొనాలంటే పెద్దరైతుగా ఉండాలి. ఇప్పుడు ప్రభుత్వం కస్టం హైరింగ్ గ్రూపులు ఏర్పాటు చేసి మాలాంటి చిన్న రైతులకు కూడా అందజేస్తోంది. ఇప్పుడు వ్యవసాయం చాల సులువైంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది పర్యటించి సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ చర్యలు తెలియజేస్తున్నారు.
– బాబురెడ్డి, రైతు, నింద్ర బీసీ కాలనీ

వ్యవసాయం పండుగలా మారింది



ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా అన్ని విధాలా ఆదుకుంటుండడంతో వ్యవసాయం పండుగలా మారింది. ట్రాక్టర్, సాగు పరికరాలు కొనుగోలు చేయలేని రైతులకు హైయిరింగ్ గ్రూపులు ఏర్పాటు చేసి సబ్సిడీ ధరలకు అందిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోంది. మాగ్రూపు సభ్యులు వేరుశనగ నూర్పిడీ యంత్రం కోనుగోలు చేశాం.
– తోయదాక్షం, రైతు, అగరం

12 నాటికి నాడు-నేడు పూర్తి కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభ నాటికి నాడు నేడు పనులు పూర్తి కావాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. మంగళవారం నాడు–నేడు ఫేజ్ 1, ఫేజ్–2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫేజ్ 2 పాఠశాలల్లో టాయిలెట్‌లు, తరగతి గదులు మరమ్మత్తులు పూర్తిచేయాలని, తరగతి గదిలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం సూచించిన విద్యుత్ సామగ్రినే స్థానికంగా కొనుగోలు చేసుకో వాలని తెలిపారు. జగనన్న విద్యాకానుక కిట్లు ఆయా పాఠశాలల వద్దకే అందిస్తామన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

శ్రీరంగరాజపురం : మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట మామిడి మార్కెట్ ఎదుట రైతులు మామిడికాయల లోడ్‌తో నిరసన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మామిడి ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడుతూ రైతులకు కేజీకి గరిష్టంగా రూ.15.50 పైసలు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని తెలిపారని, ఆమేరకు కొనుగోలు చేయాలని కోరారు.

17 వరకు డయేరియాపై అవగాహన

విజయపురం (నగరి): ఈనెల 17వ తేదీ వరకు డయేరిపై ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు విజయపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్(ఐడీసీఎఫ్) కార్యక్రమ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ సెంటర్‌లో తప్పనిసరిగా ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

హోరు గాలి.. జోరు వాన



నగరిలో కురుస్తున్న వర్షం

మండలంలో మంగళవారం సాయంత్రం హోరుగాలితో వర్షం కురిసింది. వర్షం తాకిడి కన్నా గాలి వేగంగా వీచింది. గాలితో పాటు దుమ్ము, దూళితో పాటు తేలికపాటి వస్తువులు ఎగిరిపోయాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది త్వరితగతిన సరి చేసి సరఫరాను అందించారు. – నగరి

విస్తృతంగా కలెక్టర్ పర్యటన

గుడుపల్లె: మండలంలో విస్తృత స్థాయిలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం పర్యటించారు. మండలంలోని బెగ్గిలిపల్లె వైఎస్సార్ లేఔట్‌లో నిర్మించిన జగనన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం శెట్టిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకలపై విద్యార్థులను విచారించారు. అనంతరం గుడుపల్లె సచివాలయాన్ని సందర్శించి వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, రైతు భరోసా కేంద్రాల భవనాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. కాడేపల్లెలోని మిల్లెట్ మిల్లులను పరిశీలించి వాటి నుంచి వచ్చే ఆదాయాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీఓ రమణ, ఈఓపీఆర్డీ శంకర్, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



మిల్లెట్ మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

సుబ్రమణ్యస్వామికి అభిషేక పూజలు



కార్వేటినగరం: మండల కేంద్రంలో స్కంధ పుష్కరిణీ సమీపంలో వెలసి ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో జేష్ఠ మాసం మంగళవారం సందర్భంగా ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. చందన, జలాభిషేకాలు నిర్వహించారు. శ్రీస్వామి, అమ్మవార్లను పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా రథోత్సవం



కుప్పంరూరల్: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మే 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం ఘనంగా సాగింది. ఉదయం స్వామి వారు రథంపై గ్రామ వీధుల్లో విహరించారు. ఇళ్ల వద్దకు రథం రాగానే భక్తులు పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పేదల భూములను పరిరక్షించాలి

వెదురుకుప్పం: పేదలకిచ్చిన భూముల అన్యాక్రాంతంపై అధికారులు చర్యలు తీసుకోవాలని వెనుకబడిన కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెదురుకుప్పం తూర్పు దళితవాడ, బీసీ కాలనీల్లో బహుజన చైతన్య యాత్రను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన రెండు ఎకరాల భూమి అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. అధికారులు ఈ భూములను గుర్తించి తిరిగి పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శులు కృష్ణ, మధు, చంద్రమౌళి పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న బీసీఎఫ్ నాయకులు

చదరంగంతో విద్యపై ఏకాగ్రత

శ్రీకాళహస్తి: చదరంగంతో విద్యపై ఏకాగ్రత పెరుగుతుందని పలువురు అన్నారు. ద చిల్డ్రన్స్ అసోసియేషన్ అకాడమీ వారం పాటు చదరంగంపై శిక్షణ ఇచ్చి పోటీలు నిర్వహించింది. మంగళవారం జరిగిన తుదిపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసింది. గా నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 1999 నుంచి విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొల్లినేని జగన్నాథంనాయుడు, పఠాన్ ఫజరుల్లా ఖాన్, సంస్థ సభ్యులు మాజీ ప్రధానపాధ్యాయులు సురేష్, శ్యామ్‌సుందర్, భక్తవత్సలం, రమేష్, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సమన్వయంతో లక్ష్యాలు సాధించాలి

చిత్తూరు అర్బన్: వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్ల సమన్వయంతో హౌసింగ్ లక్ష్యాలను అధిగమించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై మంగళవారం సాయంత్రం కమిషనర్ డాక్టర్ జె.అరుణ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్డీఓ రేణుకతో కలిసి వార్డు కార్యదర్శులు, సూపర్‌వైజర్ అధికారులతో జేసీ సమీక్షించారు. జూలై 31 నాటికి నిర్దేశించిన ఇళ్లను పూర్తిచేసేలా వార్డు కార్యదర్శులు పరస్పర సహకారంతో లబ్ధిదారులను చైతన్యవంతం చేయాలన్నారు. చిత్తూరును మొదటి స్థానంలో నిలపడమే ధ్యేయంగా ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పద్మజ, నగర పాలక, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

నియామకం

నింద్ర: నిరుద్యోగ దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా నింద్రకు చెందిన ఉమాపతి ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం మంగళవారం విజయ వాడలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమాపతి గౌరవాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయన ని యా మకం పట్ల మండలానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.



ఉమాపతి

దినకర తేజా... గోవిందా..!



సూర్యప్రభ వాహనంలో కల్యాణ వేంకటేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం వెలుగును నింపే దినకరుడిని, రాత్రి చల్లని వెలుగుతో నింపే చంద్రుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేశారు. దీప ధూప నైవేద్యాలను సమర్పించారు. 8.30 గంటలకు సూర్యప్రభ వాహనాన్ని విశ్వరూప దర్శనధారిగా శ్రీవారు అధిష్టించి పురవీధుల్లో ఊరేగారు. వీధుల్లో మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం బాల గోపాలునిగా స్వామి వారు ఉయ్యాలసేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన ఉత్సవమూర్తులు ఊరేగింపుగా బయలుదేరారు. ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ తదితరులు పర్యవేక్షించారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. సాయంత్రం అశ్వవాహన సేవ అనంతరం రాత్రి 7 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవంలో దంపతులు వెయ్యి రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబు

ఐరాల: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసుకునే రైతులకు మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే మండలానికి 1,545 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందిస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ..

మండలంలోని పెద్దగొల్లపల్లె గృహసారథి రమేష్ కుమార్తె గౌతమి ఇటీవల మృతిచెందారు. మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు రమేష్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.